క్లుప్తంగా

మద్యం కలిగి ఉన్న వ్యక్తి అరెస్టు

చీరాల: అక్రమంగా మద్యం కలిగిఉన్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చీరాల ఎక్సైజ్ సీఐ పి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఎక్సైజ్ బి.శ్రీహరి, సిబ్బంది గురువారం చీరాల మండలం వాడరేవులోని ఫిష్ మార్కెట్ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వాడరేవుకు చెందిన కోకి ఏడుకొండలు అనే వ్యక్తి అక్రమంగా మద్యం కలిగి ఉండగా అతడిని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి ఏడు బ్రాందీ, ఎనిమిది బ్లాక్ విస్కీ బాటిళ్లు మొత్తం 15 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం సీసాలు కలిగి ఉండడం, రవాణా చేయడం నేరమని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

హనుమోజీపాలెంలో నేత్రదానం


శ్రీనివాసరావు (ఫైల్)

ఇంకొల్లు (చినగంజాం): మండలంలోని హనుమోజీ పాలెం గ్రామానికి చెందిన బెల్లం శ్రీనివాసరావు (50) గురువారం మృతి చెందడంతో ఆయన నేత్రాలను బంధువులు దానం చేశారు. మృతుడి భార్య పద్మ, కుమార్తె శృతిల అంగీకరించటంతో నేత్రాలను ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు (స్వామి) సమక్షంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్‌కే రఫి, కోశాధికారి చుండి సాంబశివరావు, కావూరి నాగార్జున, భవాని, బంధుమిత్రులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు


ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

చీరాల అర్బన్: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న పవని భానుచంద్రమూర్తికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్‌ఆర్‌పీఎం హైస్కూల్‌లో అభినందన సభను నిర్వహించారు. హెచ్‌ఎం ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ఎప్పుడూ నిత్య విద్యార్థినే అని, ఉపాధ్యాయ వృత్తిలో అంచలంచెలుగా ఎదగడంతో పాటు విద్యార్థులను కూడా ఉన్నత స్థానంలో నిలిపినప్పుడే ఉపాధ్యాయ వృత్తికి న్యాయం చేసినవారమవుతామన్నారు. అనంతరం భానుచంద్రమూర్తిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏయూఎల్ పార్వతి, జి.రమేష్, వెంకటేశ్వరరెడ్డి, డీవి జగన్నాథాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బల్లికురవ: మార్టూరు విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు బల్లికురవ మండలంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ పీ. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బల్లికురవ, వేమవరం, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం సబ్‌స్టేషన్‌ల పరిధిలో గృహాలు, పరిశ్రమల నిర్వాహకులు అంతరాయానికి సహకరించాలని కోరారు.

నేడు గ్రీవెన్స్ సెల్

బల్లికురవ: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు, నాలుగో శుక్రవారాలు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రీవెన్స్ సెల్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కవిత గురువారం ప్రకటనలో తెలిపారు. ప్రతి నెల మూడో శుక్రవారం దివ్యాంగులకు, నాలుగో శుక్రవారం గిరిజనులు ఏస్సీలు తమ సమస్యలు విన్నవించుకుంటే పరిష్కారానికి చర్యలు చేపడతామని తహసీల్దార్ వివరించారు.

కుమార్తె కనిపించడంలేదంటూ తండ్రి ఫిర్యాదు

చీరాల: తన కుమార్తె కనిపించడంలేదంటూ తండ్రి పోతురాజు గురువారం ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఒన్‌టౌన్ పోలీసుల తెలిపిన వివరాల మేరకు.. చీరాల విజిలిపేటకు చెందిన చుండూరి పోతురాజు కుమార్తె ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతుంది. యువతి గురువారం నుంచి కనిపించడంలేదని, చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఆచూకీ తెలియలేదన్నారు. దీంతో తండ్రి ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా శ్యామలాదేవి

చీరాల రూరల్: కక్షిదారులకు నిరంతరం అందుబాటులో ఉంటూ న్యాయసహాయం అందిస్తానని నూతనంగా ఏజీపీగా బాధ్యతలు చేపట్టిన జి. శ్యామలాదేవి పేర్కొన్నారు. చీరాల కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా (ఏజీపీ) బాధ్యతలు చేపట్టిన జి. శ్యామలాదేవిని గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు మాట్లాడుతూ బాపట్ల కోర్టులో న్యాయవాదిగా, ఏజీపీగా విధులు నిర్వర్తిస్తున్న శ్యామలాదేవిని చీరాల కోర్టులో ఇన్‌చార్జ్ ఏజీపీగా నియమించారని చెప్పారు.

బీమాకు మంగళం!

- రైతులపై ఇన్సూరెన్స్ ప్రీమియం భారం
- రైతులు ప్రీమియం చెల్లిస్తేనే పరిహారం
- కూటమి ప్రభుత్వంపై రైతుల మండిపాటు


వేరుశనగ పంట

వేటపాలెం:

అబద్ధాలు చెప్పడంలో సీఎం చంద్రబాబునాయుడు దిట్ట. నోరు తెరిస్తే చాలు చెప్పిన మాటలను, ఇచ్చిన వాగ్దానాలను అమాంతం నాలుక మడత పెట్టడంలో ఆయనకు ఆయనే సాటి. అధికారంలోకి వచ్చాక అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ఏటా రూ. 20 వేల రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం హామీని నెరవేర్చపోగా రైతులపై అదనంగా ఇన్సూరెన్స్ ప్రీమియం భారం మోపేందుకు సిద్ధమైంది. అలాగే రైతులపై జీఎస్టీ మోపడంతో కూటమి సర్కార్‌పై రైతులు మండిపడుతున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఐదేళ్లపాటు రైతుల తరఫున ప్రీమియం చెల్లించి ఆదుకుంది. దీనికితోడు పెట్టుబడి సాయం కింద రైతుల ఖాతాల్లో ఏటా రూ.13,500 జమచేస్తూ వచ్చింది. ఇటీవల కూటమి సర్కార్ రాష్ట్రంలో కొలువుదీరడం తో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది.

డిసెంబర్ 15లోపు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి..



రబీ సీజన్‌లో రైతులు డిసెంబరు 15వ తేదీలోపు కొన్ని పంటలకు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి. మరికొన్ని పంటలకు డిసెంబరు 30 వరకు ప్రీమియం చెల్లించుకొనే అవకాశం ఉంది. బ్యాంకుల్లో వ్యవసాయ రుణాలు పొందే వారు అక్కడే ప్రీమియం చెల్లించుకోవచ్చు. మిగిలిన వారు స్థానికంగా ఉండే కామన్ ఫెసిలిటీ సెంటర్స్ ద్వారా ప్రీమియం చెల్లించాలి.

– ఐ కాశీవిశ్వనాథ్, ఏవో, వేటపాలెం

పెట్టుబడులు పెట్టలేక రైతుల ఇబ్బందులు..

అన్నదాత సుఖీభవ పథకం కింద ఏటా రైతులకు రూ.20 వేలు అందజేస్తామని హామీ ఇచ్చిన కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నా దాని గురించి ఊసే ఎత్తడం లేదు. ఖరీఫ్ సాగుకు రెండు నెలల ముందే కూటమి ప్రభుత్వం కొలువు దీరడంతో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేస్తారని, పంటల సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతుల ఆశలు అడియాసలయ్యాయి. కనీసం రబీ సీజన్ సమయానికైనా పథకాన్ని అమలు చేస్తారనుకుంటే అదీ లేకుండా చేశారు. ప్రతి ఏటా పంటల సాగులో పెట్టుబడి ఖర్చులు పెరగడం, మరో వైపు ప్రకృతి వైపరీత్యాలు, ఇంకో వైపు దిగుబడులు సరిగా రాకపోవడం వంటి కారణాలతో రైతులు నష్టాలు పాలవుతున్నారు. దీంతో చాలా మంది రైతులు వ్యవసాయానికి దూరమై ఇంతర రంగాల్లో పనులు చేసుకుంటున్నారు. మరికొంత మంది రైతులు ప్రత్యామ్నాయం లేకపోవడంతో కష్టమైనా నష్టమైనా పంట సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

రైతులకు గుదిబండగా మారిన ప్రీమియం..

ప్రస్తుతం రైతులు అప్పులు చేసి పంటలను సాగు చేసుకున్నారు. పంటలు సాగు కోసం రైతన్నలు అప్పులు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ ఏడాది రబీ సీజన్ నుంచి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలంటూ కూటమి ప్రభుత్వం స్పష్టం చేయడంతో రైతులకు ఇది గుదిబండగా మారిందని రైతులు వాపోతున్నారు. ప్రీమియం చెల్లింపునకు ప్రభుత్వం డిసెంబర్ 15 తుది గడువు విధించింది. రుణాలు రెన్యూవల్ చేసుకుంటే తప్ప ప్రీమియం కట్టించుకోమని బ్యాంకర్లు తెగేసి చెప్తుండటంతో రుణాల చెల్లింపు రైతులకు తలకు మించిన భారంగా మారింది. అసలే అప్పులు చేసి పంటలు సాగు చేపట్టిన తాము ఇప్పుడు రుణాలను రెన్యూవల్ ఎలా చేయగలమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రీమియం చెల్లింపు అదనపు భారం..

గత ఐదేళ్లుగా పంటల సాగుకు ముందు పెట్టుబడి సాయం అందుకున్న రైతులకు కూటమి ప్రభుత్వం కొలువయ్యాక ఆ సహాయం అందకూండా పోయింది. దీంతో అప్పులు చేసి పంటల సాగు చేపట్టాం. ఇన్సూరెన్స్ ప్రీమియం కూడా గత ప్రభుత్వమే చెల్లించగా కూటమి ప్రభుత్వం రైతులనే కట్టమంటుంది. అసలే ఇబ్బందుల్లో ఉన్న రైతులకు ఇప్పుడు ప్రీమియం చెల్లింపు అనేది అదనపు భారంగా మారింది.

సమయానికి రారు.. పనులు చేయరు?

- అధికారులు స్థానికంగా ఉండేదెన్నడూ..?
- రైలు వస్తేనే అయ్యావార్లు విధులకు హాజరయ్యేది
- ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోని అధికారులు, సిబ్బంది
- చీరాలలో ఇబ్బందులు పడుతున్న ప్రజలు, అర్జీదారులు


చీరాల ఎంపీడీవో కార్యాలయం

చీరాల టౌన్: ప్రభుత్వ అధికారులు, సిబ్బంది ప్రజలకు జవాబుదారిగా ఉండాలి. ప్రభుత్వ సిబ్బంది పనిచేసే ప్రదేశంలోనే నివాసం ఏర్పాటు చేసుకోవాలి. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించి సమయానికి విధులకు హాజరుకావాలని నిత్యం మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు ఆదేశించే మాటలివే. కాని ఆచరణలో మాత్రం అందుకు పూర్తిగా విరుద్ధంగా జరుగుతోంది. ప్రభుత్వ శాఖల్లోని అధికారులు, సిబ్బంది మాత్రం 10 మందిలో ముగ్గురు కూడా తాము విధులు నిర్వహించే ప్రాంతంలో నివాసం ఉండటం లేదు. అటెండర్ స్థాయి నుంచి గెజిటెడ్ స్థాయి అధికారి వరకు ప్రభుత్వ నిబంధనలు పక్కన బెట్టి వారి సొంత ఊర్లనుంచి ప్రతి రోజూ రైళ్లు, తమ సొంత వాహనాల్లో విధులకు హాజరవుతున్నారు. రైళ్లు, బస్సులు ఆలస్యం కావడంతో అధికారులు, సిబ్బంది సైతం ప్రభుత్వం సూచించిన సమయానికి విధులకు రావడం లేదు. దీంతో కార్యాలయాల్లోని అధికారుల గదులు మధ్యాహ్నం 11 గంటల సమయంలోనే తెరచుకుంటున్నాయి. దీంతో వివిధ సమస్యలపై వచ్చిన ప్రజలు అయ్యావార్ల కోసం ఎదురుచూపులు చూస్తూనే ఉన్నారు.

సమయపాలన పాటించని ఉద్యోగులు..

చీరాల ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఉన్న రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఉపఖజానా, హౌసింగ్, ఆర్‌అండ్‌బీ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఎంపీడీవో, సబ్ రిజిస్ట్రార్ తదితర శాఖల కార్యాలయాలు ఉన్నాయి. అలానే ఉద్యానశాఖ, ఐసీడీఎస్, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటుగా ఆయా కార్యాలయాల్లో పనిచేస్తున్న అటెండర్లు సైతం ఉద్యోగం చేసే ప్రదేశంలో నివాసం ఉండటం లేదు. గ్రామానికి ముఖ్యమైన వీఆర్వో, గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషించే పంచాయతీ సెక్రటరీ, మండల అభివృద్ధికి కృషి చేయాల్సిన ఎంపీడీవో, గ్రామాల్లో ప్రభుత్వ పథకాలను అమలు చేయించాల్సిన ఈవోఆర్డీ, రైతులకు అన్నీ రకాల సూచనలివ్వాల్సిన వ్యవసాయ శాఖ, ఉద్యోగస్తులకు నెలవారీగా జీతాలు అందించాల్సిన ఉపఖజానా అధికారులు.. ఇలా చెప్పుకుంటే చాలా ప్రభుత్వశాఖల అధికారులు చీరాలలో నివాసం ఏర్పరచుకోకుండా రోజు రైళ్లు, తమ వాహనాల ద్వారా తమ స్వగ్రామాల నుంచి చీరాలకు వచ్చి విధులు నిర్వహిస్తున్నారు. చాలా మంది వీఆర్వోలు వారికి కేటాయించిన గ్రామాల్లో కాకుండా చీరాల, కొత్తపేట, వేటపాలెం ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. కొంత మంది పంచాయతీ కార్యదర్శులు సైతం వారికి కేటాయించిన గ్రామాల్లో నివాసం ఉండకుండా చీరాల, గుంటూరు, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి ప్రతి రోజు ప్రయాణాలు చేస్తూ విధులకు హాజరవుతున్నారు. అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో అందుబాటులో ఉండకపోవడం, నిర్ణీత సమాయానికి విధులకు హాజరుకాక పోవడంతో మండలంలోని గ్రామాల్లోని ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండల అధికారులు, సిబ్బంది పనిచేసే ప్రదేశంలో ఉండాలని అధికారులకు ఆదేశాల్చినా ఒక్క అధికారి కూడా స్థానికంగా నివాసం ఉండేందుకు కనీసం ఏర్పాట్లు చేసుకోలేదు. ఫలితంగా అయ్యావార్ల రాకకోసం అర్జీదారులు ఎదురు చూస్తూనే ఉన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించి గ్రామాలు, మండల ప్రధాన కేంద్రాల్లో ముఖ్య అధికారులు ఎన్నడు నివాసం ఉంటారో వేచి చూడాలి.

అధికారులు అందుబాటులో ఉండాలి..

ప్రభుత్వ అధికారులు నిర్ణీత సమయంలోగా కార్యాలయాలకు చేరుకుని ప్రజలకు అందుబాటులో కచ్చితంగా ఉండాలి. ప్రభుత్వ ఆదేశాలను విధిగా పాటిస్తూ సమయపాలన పాటిస్తే ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించవచ్చు. ఇతర ప్రాంతాల నుంచి తమకు కేటాయించిన కార్యాలయానికి ఆలస్యంగా రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో రోజుల తరబడి ప్రజలు కార్యాలయాల చుట్టు తిరగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వ అధికారులు సమయపాలన పాటించాల్సిందే.

– ఎస్.బాబూరావు, సీపీఎం చీరాల ఏరియా కార్యదర్శి

వైద్యం కోసం విద్యార్థికి సాయం


విద్యార్థి శశిధర్‌తో తల్లిదండ్రులు

బల్లికురవ: అనారోగ్యం బారిన పడిన పేద విద్యార్థికి ఆర్థిక సాయం అందించారు దాతలు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన బీ. పూర్ణచంద్రరావు, అనూష దంపతులకు కుమార్తె శ్రీవల్లి, కుమారుడు శశిధర్ ఉన్నారు. కుమార్తె బల్లికురవ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి చదువుతుండగా, కుమారుడు శశిధర్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. 15 రోజుల క్రితం శశిధర్ అనారోగ్యానికి గురయ్యాడు. ఈ విషయం హెచ్‌ఎం కె. ఏడుకొండలు దృష్టికి తీసుకెళ్లారు. వైద్యం చేయించే స్తోమత తమకు లేదని తల్లిదండ్రులు కళ్లనీళ్ల పర్యంతం అయ్యారు. మీకోసం మేము సైతం మానవత్వంతో స్పందించండి. మన తోటి వారిని ఆదుకోండి అన్న నినాదంతో ఏర్పాటు చేసిన చేయూత ఆర్గనైజేషన్ ద్వారా విరాళాలు సేకరించి విద్యార్థి తల్లిదండ్రులకు అప్పగించారు. గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స చేయించారు. గురువారం విద్యార్థి పాఠశాలకు రావటంతో శశిధర్ తోపాటు తోటిపిల్లలు సంతోషించారు. నెఫ్రొజియా వ్యాధితో ఇన్‌స్పెక్షన్ సోకిందని భవిష్యత్‌లో ఈ వ్యాధి రాకుండా ఉండాలంటే ఖరీదైన ఇంజక్షన్‌లు చేయించాలని వైద్యులు సూచించనట్లు తల్లి దండ్రులు సాక్షికి, ఆర్గనైజేషన్‌కు తెలిపారు. దయగల దాతలు చేయూత నిస్తే వైద్యం చేయిస్తామని 79811 68601 నంబర్‌కు ఫోన్‌పే, గూగుల్‌పే, ద్వారా ఆర్థిక సాయం అందించాలని తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

వ్యవసాయ భూముల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డీఓ చంద్రశేఖర్

జే.పంగులూరు: వ్యవసాయ భూములను గృహ అవసరాలకు మార్చుకునేందుకు భూములను ఆర్డీవో తూమాటి చంద్రశేఖర్ పరిశీలించారు. గురువారం మండల పరిధిలోని రేణింగవరంలో పంట భూమిని గృహ అవసరాల మార్పిడి నిమిత్తం గ్రామానికి చెందిన పద్మజ అర్జీ దాఖలు చేశారు. అర్జీని పరిశీలించిన తహశీల్దార్ పీ శింగారావు ఆర్‌డీవోకి బదిలీ చేశారు. సర్వే నంబర్ 103–6ఏలో 1.3250 ఎకరాల భూమిని ఆర్‌డీవో పరిశీలించారు. ఆయనతో పాటు సర్వేయర్ రాజా, రైతులు ఉన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు తప్పనిసరి


వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకట్రావు

కారంచేడు: దుకాణదారులు తప్పకుండా తమ పరిధిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవల్సి ఉందని ఎస్‌ఐ వీ వెంకట్రావు అన్నారు. గురువారం రాత్రి ఆయన మండల కేంద్రమైన కారంచేడు పీఎస్‌లో ఏర్పాటు చేసిన దుకాణ యజమానుల అవగాహన కార్యక్రమంలో ఆయన పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. దుకాణాలు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం వలన కొత్తవారు వచ్చినప్పుడు వారి కదలికలపై అనుమానాలు ఉన్నప్పుడు సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. అనుమానితులతో పాటు, దొంగలను కూడా నివారించచ్చన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లోను ఈ సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సాయి, పోలీస్ సిబ్బంది, గ్రామంలోని వ్యాపారులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ



సూట్‌కేసును బాధితులకు అప్పగిస్తున్న టూటౌన్ సీఐ

చీరాల: ఆటోలో ప్రయాణిస్తూ ఆటోలో మరచిపోయిన సూట్‌కేసును సురక్షితంగా టూటౌన్ పోలీసులు బాధితులకు సురక్షితంగా అప్పగించారు. టూటౌన్ సీఐ నాగభూషణం వివరాల మేరకు.. హైదరాబాద్ నాగోల్‌కు చెందిన భార్యాభర్తలు దాసరి పవన్ ప్రసాద్, లక్ష్మీ మృదుల కొత్తపేటలోని బంధువుల ఇంటిలో శుభకార్యానికి వచ్చారు. పేరాలలోని బంధువుల ఇంటికి వెళ్లి పలకరించి అనంతరం గురువారం మధ్యాహ్నం పేరాల సెంటర్‌లో ఆటోలో కొత్తపేటలోని బంధువుల ఇంటిలో శుభ కార్యానికి హాజరయ్యారు. ఈ క్రమంలో ఆటోలో సూట్‌కేసును మరిచిపోవడంతో వెంటనే టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన సీఐ ఆటో వివరాలను సేకరించారు. ఆటో డ్రైవర్ పందిళ్లపల్లి నిరీక్షణగిరికి చెందిన పొన్నపొడి జకరయ్యగా గుర్తించి ఫోన్ చేశారు. ఆటోలో ఉన్న సూట్‌కేసును తాను గమనించలేదని, సూట్‌కేసును టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. సూట్‌కేసులో సవరు బంగారం, రూ.6 వేలు నగదు ఉందన్నారు. దీంతో బాధితులను పిలిపించి వారికి సూట్‌కేసును సురక్షితంగా అప్పగించారు. వెంటనే స్పందించి తమ సూట్‌కేసును అందించినందుకు వారు సీఐకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కల్యాణం


కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

చినగంజాం: మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసియున్న శ్రీదేవిభూదేవి సమేత చెన్నకేశవస్వామి వారి వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. యాజ్ఞీత స్వామి దీవి హనుమత్ ప్రసాద్, అర్చక స్వామి నారాయణం సత్యబాబు, నారాయణం సారంగపాణి ఆధ్వర్యంలో కళ్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గ్రామంలోని పలువురు దంపతులు పూజా కార్యక్రమాలలో పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి పోతిన శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు, భక్తులు అందరూ కలిసి మహోత్సవం నిర్వహించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన దినోత్సవం


అలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు

చీరాల అర్బన్: పట్టణంలోని సంతబజారులో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి 99వ విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం దేవస్థానంలో ఘనంగా నిర్వహించారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గుంటూరు మాధవరావు, కమిటి సభ్యులు పర్యవేక్షణలో ఉదయం దేవాలయంలో అమ్మవారికి పంచామృతాభిషేకం, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, ధ్యానమండలి చీరాల శాఖ వారిచే నామసంకీర్తన, భజన కార్యక్రమం నిర్వహించారు. 9గంటలకు శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి సహస్ర నామ సహిత కుంకుమార్చన, శాంతి హోమం చేశారు. అనంతరం మూడు వేల మందికి అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి 7గంటలకు వాసవీ సహస్రాధిక దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

చీరాల అర్బన్: మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్‌కు వినతిపత్రం అందించారు. సంఘ నాయకులు మాట్లాడుతూ గత సమ్మె కాలంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన కమిషనర్ సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నిస్తానని చెప్పారన్నారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఇంజనీరింగ్ కార్మికుల అధ్యక్షులు రుద్రబోయిన బాజీబాబు, కార్యదర్శి చిమటా వీరాస్వామి, కోశాధికారి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు సురేష్, అవుట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ సిబ్బంది ఉన్నారు.

చెత్త కుప్పలతో ప్రజల ఇబ్బందులు


పేరుకుపోయిన చెత్త కుప్పల్లో పందులు స్వైరవిహారం

చీరాల రూరల్: పట్టణంలోని మరియమ్మపేటలో రెండు రోజులుగా మున్సిపల్ కార్మికులు చెత్త కుప్పలు తొలగించకపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ కార్మికులు ఇళ్లల్లో నుంచి సేకరించిన చెత్త చెదారాలను చిన్న ట్రాలీల ద్వారా మరియమ్మపేట శివారు ప్రాంతంలోని ఐక్యనగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి వద్దగల మంచినీటి ప్లాంట్ వద్ద డంప్ చేస్తారు. అధిక మొత్తంలో చెత్త పోగైన సందర్భంలో మున్సిపల్ ట్రాక్టర్‌లో చెత్తను తరలిస్తారు. చెత్త అధిక మొత్తంలో ఉన్నప్పటికి రెండు రోజులుగా చెత్త కుప్పలు తొలగించకపోవడంతో ఆ పరిసరాలు దుర్వాసనతో నిండిపోయింది. దానికి తోడు చెత్త కుప్పలను పందులు పెకలించి చిందరవందర చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా మున్సిపల్ అధికారులు స్పందించి కార్మికులతో చెత్త కుప్పలను తొలగించాలని వేడుకుంటున్నారు.

మాజీ సీఎం జగన్‌ను కలిసిన వెంకట్రావు


మాజీ సీఎం జగన్‌తో మాట్లాడుతున్న వెంకట్రావు

పర్చూరు (చినగంజాం): మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహనరెడ్డిని పర్చూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొల్లా వెంకట్రావు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం కలిశారు. నియోజకవర్గంలో తొమ్మిది మంది కార్యకర్తలపై అక్రమంగా కేసులు బనాయించడం, సోషల్ మీడియా కార్యకర్తలపై తరచూ జరుగుతున్న వేధింపుల గురించి వెంకట్రావు జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు.

అర్జీల విచారణలో అలసత్వం తగదు

చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ కుర్రా గోపీ కృష్ణ సూచించారు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, రెవెన్యూ అజమాయిషీ అర్జీలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలకు సత్వరంగా ప్రభుత్వ సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన పీజీఆర్ఎస్ వచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ డి.అర్జున్, వీఆర్వోలు ఉన్నారు.